కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

మిరుదొడ్డి: ధర్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్

గుర్రాలగొందిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తొర్నాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత

గజ్వేల్, ఏప్రిల్ 9: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, తక్కువ ధరతో రైతులకు మోసం చేస్తారని అందుకు కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేపట్టాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ జెజాల వెంకటేశంగౌడ్, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, పీఏసీఎస్ సీఈవో బాలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మారంలో

మిరుదొడ్డి, ఏప్రిల్ 9 : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. మిరుదొడ్డి మండలం ధర్మారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎంపీడీవో గణేశ్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం దాకయ్య, మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ ఏఎంసీ

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సీనియర్ మండల నాయకుడు లింగం, నాయకులు దుర్గారెడ్డి, మైసయ్య, వీవో లీడర్లు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 9: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి అన్నారు. ధూళిమిట్ట మండలం తొర్నాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్లు దేవునూరి దేవదాసు, నారోజు శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు బండారి కనకయ్య, ఇర్రి రాంరెడ్డి, పీఏసీఎస్ సీఈవో బోయిని శ్రీధర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9 : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మిట్టపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని తడ్కపల్లి, కిష్టసాగర్, పొన్నాల, బక్రిచెప్యాల, నాంచారుపల్లి గ్రామాల్లో సిద్దిపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దుర్గారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పయ్యావుల రాములు, చింతల సంతోష్ పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో...

నారాయణరావుపేట, ఏప్రిల్ 9 : నారాయణరావుపేటతో పాటు గుర్రాలగొంది, జక్కాపూర్, గోపులాపూర్, కోదండరావుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ ఆనంద్, సీఏలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపాక మండలంలో..

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 9 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండపాక మండల కేంద్రంతో పాటు దమ్మక్కపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జంకి మండలంలో

బెజ్జంకి, ఏప్రిల్ 9: మండల కేంద్రంతోపాటు గుండారం, చీలాపూర్, పెరుకబండ, రేగులపల్లి, బెజ్జంకి క్రాసింగ్, ముత్తన్నపేట్, గాగిల్లాపూర్, వీరాపూర్, తోటపల్లి, దేవక్కపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు శరత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, ఏవో సంతోష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు అవగాహన కలిగి ఉండాలి

చేర్యాలలో మాట్లాడుతున్న సీడీపీవో రమాదేవి

చేర్యాల, ఏప్రిల్ 9 : గర్భిణులు తమ ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ చేర్యాల ప్రాజెక్టు సీడీపీవో రమాదేవి సూచించారు.పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం (6)లో పోషణ పక్వాడలో భాగంగా గర్భిణులకు మొదటి 1000 రోజుల పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం,గర్భిణిగా నిర్ధారణ అయిన ప్పటి నుంచి ఆమెకు పుట్టిన బిడ్డ రెండు సంవత్సరాల వయస్సు వచ్చే సమయాన్ని మొదటి 1000 రోజులగా పిలుస్తారన్నారు. ఈ సమయంలో గర్భిణి తీసుకోవాల్సిన పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోషణ అభిమాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కనకరాజు, సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, శోభ, రేణుక, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపల్‌లో బయోమెట్రిక్ అమలు

బయోమెట్రిక్ వద్ద వేలిముద్ర వేస్తున్న కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 9: మున్సిపాలిటీల్లో ఉద్యోగుల హాజరు తెలుసుకునేందుకు కార్యాలయాల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం పదిగంటల నుంచి పదిన్నర వరకు పర్మినెంట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా బయోమెట్రిక్ మిషన్ వద్ద వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. అనంతరం సాయంత్రం తిరిగి ఐదుగంటలకు మరోసారి వేలిముద్రలు వేస్తేనే ఉద్యోగులు విధులకు హాజరైనట్లు నమోదవుతుందని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా మున్సిపల్‌లో ఏర్పాటుచేసిన బయోమెట్రిక్ మిషన్ వద్ద హాజరుకోసం వేలిముద్ర వేయాల్సి ఉంటుందని ఆయన సూచించారు. ఈనెల 1వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో అమలవుతుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కుమార్‌యాదవ్

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 9 : కొండపాక మండలం రవీంద్రనగర్‌కు చెందిన కోడెల ఐలవ్వ ఇటీవల అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా బాధితురాలికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.81,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అందజేశారు.బాధిత కుటుంబ సభ్యులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేశంయాదవ్, నాయకులు ఐలయ్యయాదవ్, గుర్రాల నాగయ్య, శేఖర్, బుచ్చయ్య, శుక్లాచారి, భాను, రాకేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత,అధ్యాపకులు

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 9 : జానపదసాహిత్య ఆద్య పరిశోధకకుడు ఆచార్య బిరుదురాజు రామరాజు శత జయంతిని పురస్కంచుకొని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో జానపద సాహిత్యం అనే అంశంపై ఈ నెల 15,16వతేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. సదస్సు కరపత్రాన్ని బుధవారం అధ్యాపకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..జానపద సాహిత్యానికి తెలంగాణ కేంద్ర బిందువన్నారు. బిరుదురాజు రామరాజు తెలంగాణ జానపద సాహిత్యంపై చెరగని ముద్ర వేశారని చెప్పారు. ఈ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడు,ఉత్తరప్రదేశ్,ఢిల్లీ, వివిధ ప్రాంతాలను నుంచి పరిశోధకులు తరలివచ్చి పత్రాలను సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి,పిట్ల దాస్,అధ్యాపకులు అయోధ్యరెడ్డి,మధుసూదన్,గోపాల సుదర్శనం,నరేశ్,రామస్వామి,శైలజ,సాయిసురేశ్,నర్సింహులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పోషణ పక్ష ఉత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్ అన్నగోని వినోద్‌గౌడ్

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 9 : గర్భిణులు,బాలింతలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐదో వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్‌గౌడ్ సూచించారు. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్ష ఉత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పుట్టిన బిడ్డకు ముర్రపాలు పట్టించాలని, చిన్నారులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలలు దాటిన పిల్లలకు బాలమృతం, సమయానికి టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న,టీచర్లు స్వప్న చంద్రకళ,జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణరావుపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రేవతి

నారాయణరావుపేట, ఏప్రిల్ 9 : నారాయణరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి సందర్శించారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతుల కోసం నిధులు మంజూరైనా పనులు ఎందుకు కావడం లేదని అడిగారు. ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, ఫార్మాసిస్ట్ మల్లికార్జున్, యూడీసీ భార్గవి, స్టాఫ్ నర్సు కవిత పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

చిన్నకోడూరు, ఏప్రిల్ 9: మండలంలోని మాచాపూర్‌లో బుధవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చంద్లపూర్ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా టీకాలు వేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



హుస్నాబాద్‌లో కేడీ, డీసీ, రౌడీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 9: హుస్నాబాద్ సర్కిల్ పరిధిలో ఉన్న కేడీ, డీసీ, రౌడీ, సస్పెక్ట్‌లకు బుధవారం సీఐ శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నేర చరిత్ర కలిగిన వారందరూ నేటి సమాజంలో సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో మంచి పేరు తీసుకురావాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మహేశ్, అభిలాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు ఫారాలు సమర్పించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 9: రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తు ఫారాలను మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని మద్దూరు ఎంపీడీవో సోమిశెట్టి రామ్మోహన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలన్నారు. మండలంలోని 10 గ్రామాల్లో ఇప్పటి వరకు ఆరు వందలమంది దరఖాస్తు చేసుకుంటే అందులోమూడు వందల మంది మాత్రమే తమ దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందించారని తెలిపారు. ఒక వేళ కార్యాలయంలో దరఖాస్తు పత్రాలను అందించకపోతే సదరు దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయం

చేర్యాలలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హుస్నాబాద్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్

చేర్యాల, ఏప్రిల్ 9 : ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు చల్లని మినరల్ వాటర్ అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ 12వ వార్డు అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ పేరిట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, నాయకులు పాల బాలయ్య, భూమిగారి రాజేందర్, బుడిగె గురవయ్యగౌడ్, ఉట్కూరి అమర్‌గౌడ్, ముస్త్యాలమహేందర్, రాచకొండ సత్తయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 9: మండుతున్న వేసవిలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, గాంధీ చౌక్, మల్లెచెట్టుచౌరస్తా, అక్కన్నపేట చౌరస్తాలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తాటి మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన వెల్లువ

గజ్వేల్: అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి: కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి, ఏప్రిల్ 9 : కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ బొమ్మచౌరస్తా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కట్టెలపొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వచ్చిన 11ఏండ్లలో పేదల కంటే ఆయిల్ కంపెనీలకే ఎక్కువ లాభం చేకూర్చిందన్నారు. ఆయిల్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు పేదలపై భారం మోపడం సరికాదన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురుల బ్యారెల్ ధర తగ్గడంతో దానికి అనుగుణంగా ధరలు తగ్గించాల్సిపోయి వంట గ్యాస్‌పై రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డాడు. వెంటనే పెంచిన ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి. కృష్ణారెడ్డి, అత్తిని శారద, మండల నాయకులు ఉల్లంపల్లి సాయిలు, తేలు ఇస్తారి, నీల భిక్షపతి, తాడూరు మల్లేశం, సార్ల యాదయ్య, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో

గజ్వేల్, ఏప్రిల్ 9: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం గ్యాస్ సిలిండర్, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందనబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం వేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రంగారెడ్డి, స్వామి, రాజు. భాషయ్య, ఐలయ్య, రాజు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక,ఏప్రిల్ 9: మోదీ సర్కారు పేద, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపి, బడా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ దుబ్బాకలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం నాయకులు భాస్కర్, సాజిద్, లక్ష్మీనర్సయ్య, రాజు, మహేశ్, మల్లికార్జున్, మల్లేశం, రఫీ పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 9: కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం మద్దూరు మండల కార్యదర్శి మహ్మద్ షఫీ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ. 50 పెంచడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పెంచిన వంటగ్యాస్ ధరను తగ్గించాలని, లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

దుబ్బాక: కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నీటిని విడుదల చేయకనే పొలాలు ఎండుతున్నాయి

దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ వద్ద సాగునీటి కెనాల్ మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్,ఏప్రిల్ :9 : మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి సకాలంలో నీటిని విడుదల చేయక రైతులు యాసంగిలో సాగు చేసిన పంటలు పశువులకు మేతగా మారుతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియాల్, మాచిన్‌పల్లి, చేగుంట మండలంలోని పలు గ్రామాల రైతులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి రామాయంపేట కెనాల్ ద్వారా వస్తున్న నీటిని ఆయన పరిశీలించారు. అక్కడనే ఇరిగేషన్ అధికారులతో సమీక్ష చేశారు. సాగు నీటికి సంబంధించిన మ్యాపును పరిశీలించి మెయిన్ కెనాల్ ద్వారా పిల్ల కాల్వల పనులు తొందరంగా చేపట్టాలని సూచించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల ద్వారా శంకంపేట, దుబ్బాక, ఉప్పరపల్లి, మెదక్, మల్కాపూర్ తదితర పెద్ద కాల్వలు పూర్తయినప్పటికీ ప్రభుత్వం కావాలనే నీటిని విడుదల చేయడంలేదని ఆరోపించారు. కేసీఆర్ కష్టపడి గోదావరి నీటిని తెచ్చి రైతుల పంటలకు అందిచాలనే లక్ష్యంతో ముందుకు సాగితే కాంగ్రెస్ ప్రభుత్వం సాగు నీటిని విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో దుబ్బాక సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

దుబ్బాక, ఏప్రిల్ 9: ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య లభిస్తుందని కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం మధ్యాహ్నం దుబ్బాక మండలం హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో విద్యార్థుల తరగతి గదులు, డార్మెటరీ గది, స్టోర్‌రూమ్‌తో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులకు గణితశాస్త్రంపై ఉన్న ఆసక్తి , ప్రతిభను పరిశీలించారు. భోజనం,వసతుల గురించి విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి గురుకులంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఎంపీడీవో భాస్కర శర్మ, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంఈవో ప్రభుదాస్, ఆర్ఐ నరేందర్ పాల్గొన్నారు.

ముల్యాంకనాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

ముల్యాంకనం కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్త్ జవాబు పత్రాల ముల్యాంకనాన్ని బుధవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. ఈ మేరకు ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా జవాబు పత్రాలను సరిగ్గా ముల్యాంకనం చేయాలని అధికారులకు సూచించారు. ముల్యాంకన కేంద్రం వద్ద తాగునీరు, ఇతర అన్ని సౌకర్యాలు సమకూర్చాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని ఆమె ఆదేశించారు.

దరఖాస్తుల స్వీకరణ పక్కాగా ఉండాలి

సిద్దిపేట,ఏప్రిల్ 9: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ పక్కాగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ సూచించారు. బుధవారం పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల స్వీకరణ సమాచార కేంద్రాన్ని ఆయన సందర్శించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కోసం రూ. 50,000 నుంచి గరిష్టంగా నాలుగు లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చివరి అవకాశం ఉందన్నారు.సిబ్బంది సాయి కృష్ణ, రమ్య,జ్యోతి ఉన్నారు.

పీఆర్టీయూ జెండావిష్కరణ

సిద్దిపేట,ఏప్రిల్ 9: తెలంగాణ ఏర్పడక ముందే తెలంగాణ ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం 2011లో గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి స్థాపించిన సంఘం పీఆర్టీయూ అని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు పన్యాల జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సిద్దిపేటలోని పీఆర్టీయూ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సమ్మయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తిరుపతి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు యమరాజు, నాయకులు రామ్‌గోపాల్ రెడ్డి,కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం పంచాయతీని సందర్శించిన డీఎల్పీవో

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 9: మద్దూరు మండలం ధర్మారం గ్రామ పంచాయతీని డివిజనల్ పంచాయతీ ఆఫీసర్(డీఎల్పీవో) వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, డంపింగ్ షెడ్‌ను పరిశీలించారు. ఎంపీవో వీరరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆకునూరులో చోరీ

చేర్యాల, ఏప్రిల్ 9 : మండలంలోని ఆకునూరులో ఉల్లెంగల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. వెంకటేశ్వర్లు వ్యక్తి గత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా తిరిగి వచ్చే సరికి ఇంటి డోర్ లాక్ ఓపెన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి రూ.35 వేల నగదు గల బ్యాగును ఎత్తుకుపోయారు. వెంకటేశ్వర్లు వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లడం, కూతురు ఇంటికి భార్య వెళ్లిన విషయాన్ని గమనించిన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో జరుగుతున్న చోరీల పై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.గతంలో జరిగిన చోరీలకు సంబంధించి ఎలాంటి పురోగతి లేకపోవడం, దొంగలు పట్టుబడకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ ప్రారంభించారు.

కొమురవెల్లి గౌడ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

కొమురవెల్లి, ఏప్రిల్ 9 : కొమురవెల్లి గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా బత్తిని యాదగిరిగౌడ్, దొడ్ల విష్ణుమూర్తిగౌడ్, అధ్యక్షుడిగా రాజుగౌడ్, ఉపాధ్యక్షుడిగా ముత్యం పరశురాములుగౌడ్, ప్రధానకార్యదర్శిగా శివలింగు రమేశ్‌గౌడ్, కోశాధికారిగా బత్తిని నర్సింహులుగౌడ్, కార్యదర్శిగా నరేశ్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, దొడ్ల చిన్నస్వామిగౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 9: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల నాయకుడు, ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి చొప్పరి సాగర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో యాత్రల పేరుతో కాంగ్రెస్ నాయకులు డ్రామాలాడుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అప్పటి సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ విగ్రహానికి ఏ ఒక్క రోజు కూడా పూలమాల వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసిన తర్వాతే యాత్రలు చేసుకోవాలని ఆయన హితవు పలికారు.

ప్లాస్టిక్ కవర్లపై నిషేధం

గజ్వేల్, ఏప్రిల్ 9: మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను నిషేధించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వ్యాపారులు, ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు సింగిల్ యూజ్ కవర్లను వినియోగించరాదని, అలా వినియోగిస్తే తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు చట్ట రీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి కవర్లు నిల్వ చేసినా, రవాణా చేసినా జరిమానా విధించి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు, పట్టణ ప్రజలు గమనించాలన్నారు.

బసవేశ్వర జయంతి అధికారికంగా నిర్వహించాలి

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 9 : బసవేశ్వరస్వామి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వీరశైవ సమాజం నేత శివప్ప అన్నారు. ఈ నెల 30న బసవేశ్వర స్వామి జయంతిని పురస్కరించుకొని బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బసవేశ్వరస్వామి జయంతిని నిర్వహించనున్నామన్నారు.గత ప్రభుత్వం బసవేశ్వర స్వామిజయంతిని అధికారికంగా నిర్వహించిందని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాజం నేతలు భద్రప్ప, ప్రశాంత్,నాగరాజు,వీరేశం,రాజమౌళి,శివలింగం, నాగరాజు,బద్రీ పాల్గొన్నారు.

12నుంచి ఉపన్యాస పోటీలు

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 9 : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నామని కళాశాల రీజినల్ కో ఆర్డినేటర్ శ్రద్ధానందం తెలిపారు. ఈ నెల 12 నుంచి భారత రాజ్యాంగం,సామాజిక న్యాయం అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం,13న భారత రాజ్యాంగ ప్రవేశికను ఎలా అర్థం చేసుకుంటారు అనే అంశంపై విద్యార్థుల చేత ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామన్నారు.